సాక్షి
కుమురం భీం

గురువారం : 14 : సెప్టెంబర్ : 2023



పల్లెల్లో కాడెద్దుల పండుగ

పల్లెల్లో నేడు పొలాల అమావాస్య పండుగ జరుపుకోనున్నారు. ఎద్దులను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

8లో▸

డీపీవోగా నారాయణరావు

ఆసిఫాబాద్: జిల్లా పంచాయతీ అధికారిగా వి.నారాయణ రావును నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 8 జిల్లాలకు చెందిన డీపీవోల బదిలీల్లో భాగంగా వెయిటింగ్‌లో ఉన్న నారాయణరావు జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీపీవోగా డీఆర్‌డీవో సురేందర్ విధులు నిర్వర్తిస్తున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4/24.9

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ 'విజయభేరి' సమన్వయకర్తలు వీరే..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ ఈ నెల 17న హైదరాబాద్ శివారు తుక్కుగూడలో నిర్వహించనున్న విజయభేరి బహిరంగ సభ విజయవంతానికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నూరు నియోజకవర్గానికి ఇర్ఫాన్ అలీ, బెల్లంపల్లికి అనిల్‌కుమార్, ఆసిఫాబాద్‌కు హైమావతి, ఖానాపూర్‌కు బి.సత్తు మల్లేశ్, నిర్మల్‌కు బి.జనక్‌ప్రసాద్, ముధోల్‌కు అబ్దుల్ ఎజాజ్‌లను నియమించారు. వీరు ఆయా నియోజకవర్గాల్లో బహిరంగ సభ విజయవంతం చేసేందుకు స్థానిక నాయకులతో సమన్వయం చేసుకోనున్నారు. కాగా, మంచిర్యాల, సిర్పూర్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు ఎవరినీ నియమించలేదు.

కార్యకర్తల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో బీజేపీని బలోపేతం చేసేదిశగా ఈ నెల 16న జిల్లా కేంద్రంలో నిర్వహించే బూత్‌స్థాయి కార్యకర్తల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాస్థాయి నుంచి బూత్‌స్థాయి వరకు పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాలు అమలయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆత్మారాం నాయక్, పాల్వాయి హరీశ్‌బాబు, కృష్ణమూర్తి, సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్, శ్రీశైలం, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒప్పంద ప్రాతిపదికన సివిల్ అసిస్టెంట్ సర్జన్, వైద్యాధికారి పోస్టుల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫార్మట్, మార్గదర్శకాల కోసం https://asifabad.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. దరఖాస్తులను నేరుగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారా గాని పంపించవచ్చన్నారు. నేటి నుంచి ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయ అర్హత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, డీఈవో అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న నిర్వహించే టెట్ కోసం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో 31 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేపర్- 1కు 4,851 మంది, పేపర్- 2 2,090 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో అభ్యర్థులు వీలైనంత తొందరగా పరీక్ష కేంద్రాలకు రావాలన్నారు. హాల్‌టికెట్‌లో ఫొటో, సంతకం, ఇతర తప్పులు ఉంటే గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించుకోవాలని సూచించారు.

20 నుంచి సదరం క్యాంపులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 20 నుంచి సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న మూగ, చెవిటి, 22న మానసిక వైకల్యం, 26న కంటిచూపు, 30న ఎముకలకు సంబంధించిన పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. క్యాంపులకు హాజరయ్యే దివ్యాంగులు ముందుగా పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించుకుని, స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బొర్కడేకు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అగ్రికల్చర్ యూనివర్సిటీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నాయకులు ప్రశాంత్, సాయికృష్ణ, తరుణ్, సిద్దార్థ తదితరులు ఉన్నారు.



ఉల్లిపిట్ట గ్రామం

పరిహారమేది..?



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బి.సుధాకర్. స్వగ్రామం ఉల్లిపిట్ట. దోర్లి- 1 ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని కింద పదెకరాల భూమి కోల్పోయాడు. ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారంతో పాటు ప్లాటు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాడు. భూములు కోల్పోయిన వారికి సంస్థలో ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడని వాపోతున్నాడు. ..ఇలా దోర్లి ప్రాజెక్టు కోసం తమ భూములను త్యాగం చేసినా మాకు న్యాయం జరగలేదని ఉల్లిపిట్ట గ్రామంలోని 228 కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇతర గ్రామాలకు ఇచ్చినట్టే మాకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. 17 ఏళ్లుగా తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గురువారం దోర్లి- 1 ప్రాజెక్టు మూసివేతలో భాగంగా సింగరేణి సంస్థ చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణలో తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

- బొగ్గు కోసం భూములు త్యాగం
- దోర్లి, ఖైరిగూడ గనుల నిర్వాసితులకు నిరాశే..
- 17 ఏళ్లుగా సింగరేణి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఉల్లిపిట్ట ప్రజలకు అందని ద్రాక్షగా పునరావాసం
- ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్
- నేడు ప్రజాభిప్రాయ సేకరణ

సాక్షి, ఆసిఫాబాద్: దక్షిణ భారతదేశంలో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిలో సంస్థగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్)కు పేరుంది. ఈ సంస్థ 2006లో తిర్యాణి మండలంలోని దోర్లి గ్రామంలో ఓపెన్‌కాస్ట్(ఉపరితల) గని ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ మేరకు అప్పట్లో దోర్లి పరిసర గ్రామలైన ఉల్లిపిట్ట, దంతేనపల్లి, ఆర్‌అండ్‌ఆర్ ఒంటిమామిడి, ఆర్‌అండ్‌ఆర్ రాంపూర, పాత దంతేనపల్లి, జెండాగూడకు చెందిన 510 హెక్టార్ల భూమిని సేకరించింది. గనుల కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం చెల్లించింది. అలాగే నిర్వాసితులకు అదే మండలంలోని ఇతర ప్రాంతాల్లో ప్లాట్లు సైతం కేటాయించింది. అయితే అదే ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన ఉల్లిపిట్ట ప్రజలకు మాత్రం నేటికీ పరిహారం లభించకపోవడం శోచనీయం. ఇప్పుడా ప్రాజెక్టునే మూసివేయడం గమనార్హం.

పరిహారం కోసం ప్రదక్షిణలు..

ఉల్లిపిట్ట గ్రామంలో 228 కుటుంబాలు నివసిస్తున్నాయి. సింగరేణి సంస్థ దోర్లి- 1 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కోసం వీరు 110 ఎకరాలు కోల్పోయారు. ఖైరిగూడలో ఏర్పాటు చేసిన ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ప్రాజెక్టు కోసం మరో 300 ఎకరాల భూములు త్యాగం చేశారు. అయితే సంస్థ పునరావాసం గురించి పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ గ్రామం ఉత్తర భాగంలో దోర్లి- 1 మట్టి దిబ్బలు దాదాపు 250 మీటర్ల దూరంలో ఉన్నాయి. తూర్పున 200 మీటర్ల దూరంలో ఖైరిగూడ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుకు చెందిన మట్టిదిబ్బలు ఉన్నాయి. దక్షిణ ప్రాంతాన్ని ఆనుకునే 10 మీటర్ల దూరంలో వట్టివాగు ప్రాజెక్టు నీరు ఉంది. బొగ్గు తవ్వకాల్లో భాగంగా చేపడుతున్న బ్లాస్టింగ్‌తో వచ్చే మట్టి, దుమ్ముతో వాతావరణం కాలుష్యమవుతుంది. సమీపంలోని వట్టివాగు ప్రాజెక్టు ఉండడంతో విష సర్పాల బెడద అధికంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం అందజేసి.. పునరావాసం కల్పించాలని గ్రామస్తులు 17 ఏళ్లుగా ప్రదక్షిణలు చేస్తున్నారు.

పునరావాసం కోసం ఎదురుచూపులు

సింగరేణి బొగ్గు గనుల కోసం సర్వం కోల్పోయిన రైతులు ప్రస్తుతం ఉపాధి కోసం ఇతర మండలాలకు వలస వెళ్తున్నారు. మిగులు భూములు సైతం వ్యవసాయానికి పనికి రాకుండా పోవడంతో కుటుంబపోషణ కోసం కార్మికులుగా మారి జీవనం సాగిస్తున్నారు. పరిహారం.. పునరావాసం కోసం ఎదురుచూస్తున్నారు. గనుల నుంచి వచ్చే కాలుష్యం కారణంగా పుశువులు సైతం రోగాల బారిన పడతున్నాయని, వాటికి రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర గ్రామాలకు ఇచ్చిన విధంగానే సింగరేణి సంస్థ నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు. అలాగే పునరావాసం కల్పించి ఆదుకోవాలంటున్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ



ఏర్పాట్లు చేస్తున్న సింగరేణి సిబ్బంది

తిర్యాణి(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని డోర్లి-1 ఓపెన్ కాస్టు మూసివేతలో భాగంగా పర్యావరణ అనుమతుల కోసం గురువారం డోర్లి ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు పీవో ఉమాకాంత్ తెలిపారు. బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభావిత గ్రామాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

స్థానికులకే కేటాయించాలి



బొగ్గు గనుల కోసం భూములు కోల్పోయిన వారికే సింగరేణి సంస్థలో ఉద్యోగాలు ఇవ్వాలి. ముఖ్యంగా స్కిల్డ్, అన్ స్కిల్డ్ ఉద్యోగాలు స్థానికులకే కేటాయించాలి. భూములు కోల్పోయి నష్టపరిహారం అందని ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు భూమికి బదులు భూమి కేటాయించాలి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ.. లేకుంటే ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలి. – ముక్కెర రాజేశ్, ఉల్లిపిట్ట

పునరావాసం కల్పించాలి



భూములు త్యాగం చేసిన కుటుంబాల్లో అర్హత ఉన్న నిరుద్యోగులకు జీవో 34 ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలి. ఆర్‌అండ్‌ఆర్ కింద ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించాలి. జీవనానికి అనువైన చోట అన్నివసతులతో కూడిన పునరావాసం కల్పించాలి. – టి.సుధాకర్, ఉల్లిపిట్ట

పట్టించుకోవడం లేదు



దోర్లి- 1 ప్రాజెక్టు కోసం మా కుటుంబం 30 ఎకరాలు త్యాగం చేసింది. అందుకు సింగరేణి సంస్థ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారంతోపాటు ఒంటిమామిడిలో ప్లాట్లు కేటాయించారు. అయితే అక్కడ సరైన సౌకర్యాలు కల్పించలేదు. దశాబ్ద కాలంగా అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదు. – ఆత్రం లక్ష్మణ్, మాజీ ఎంపీపీ, తిర్యాణి

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కెరమెరి(ఆసిఫాబాద్): గ్రామాల్లో సీసీకెమెరాల ఏర్పాటుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సై విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: వినయక చవితి, మిలాదున్ నబీ పండుగలు ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిపౌరుడు సహకరించాలన్నారు. పండుగలు సోదరభావంతో కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీస్‌శాఖ నిఘా ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ స్వామి, ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పెంచికల్‌పేట్(సిర్పూర్): గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో సురేశ్‌బాబు అన్నారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంతోపాటు దరోగపల్లి పంచాయతీ కార్యాలయాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దరోగపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాసింగ్, సర్పంచులు కమల, దేవాజీ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగుల సమ్మె తాత్కాలిక విరమణ



డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 31 నుంచి ఈ నెల 12 వరకు కొనసాగిన ఎన్‌హెచ్‌ఎం స్కీం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెను తాత్కాలిక విరమించినట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మధుకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌వో తుకారాంకు సమ్మె విరమణ పత్రాన్ని అందించారు. మధుకర్ మాట్లాడుతూ ఈ నెల 12న హైదరాబాద్‌లో డీహెచ్ కార్యాలయంలో జరిగిన చర్చల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం హామీలు అమలు చేయకుంటే భవిష్యత్తులో తిరిగి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ రాక ముందే ఎన్‌హెచ్‌ఎం స్కీం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. అలాగే రూ.32వేల వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌తోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు సదానందం, సాయికృష్ణ, సదాలక్ష్మి, అనూష, సునీత, శ్రీదేవి, మమత, రజని, వెంకటేశ్, కాశిమాల తదితరులు ఉన్నారు.

అక్రమ క్వారీలపై గరంగరం

- మైనింగ్ ఏడీని సరెండర్ చేయాలని సభ్యుల డిమాండ్
- హైవే పనుల్లో అక్రమంగా మొరం వినియోగిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణ
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అధికారులు

ఆసిఫాబాద్: 'అక్రమంగా క్వారీల్లో తవ్వకాలకు ఎలా అనుమతిస్తున్నారు... ఫోర్‌లేన్ పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా మొరం తరలిస్తే మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారు' అంటూ జెడ్పీ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశానికి కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఫోర్‌లేన్ నిర్మాణ పనుల్లో అక్రమంగా మొరం వాడుకున్నా మైనింగ్ అధికారి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌పై హైదరాబాద్ విజిలెన్స్ అధికారులు రూ.2 కోట్ల జరిమానా విధించారని పేర్కొన్నారు. జిల్లా మైనింగ్ అధికారి విధుల్లో నిర్లక్ష్యం వహించడంతోనే అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. జిల్లా మైనింగ్ అధికారి నాగరాజును ప్రభుత్వానికి సరెండర్ చేయాలన్నారు.

అధ్వానంగా 'మిషన్ భగీరథ'

జిల్లాలో మిషన్ భగీరథ పథకం అమలు అధ్వానంగా మారిందని జెడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలోనూ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. తిర్యాణి మండలంలో ఒక్క పంచాయతీకి కూడా పైప్‌లైన్ సరిగా లేదని.. తాగు నీరందడం లేదని, అధికారుల పనితీరుతో ఎన్నికలకు ప్రచారానికి వెళ్లాలంటే ఇబ్బందిగా మారిందన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీటి సమస్య ఉండడం సిగ్గుచేటన్నారు. మిషన్ భగీరథ నీరందని ప్రాంతాల్లో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారని ఈఈ వెంకటపతిని ప్రశ్నించారు. భగీరథ పైప్‌లైన్ కోసం సీసీ రోడ్లు ధ్వంసం చేస్తే, మరమ్మతులు ఎవరు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాటవేత ధోరణి విడిచి సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలకు వెళ్తే ప్రజలు నిలదీసే పరిస్థితి ఉందని, తాగునీటి సమస్య పరిష్కరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ అన్నారు.

- జిల్లాలో అవసరమైన చోట కొత్తగా అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సిర్పూర్ నియోజకవర్గంలో బిల్లులు వెంటనే విడుదల చేస్తున్న పంచాయతీరాజ్ అధికారులు.. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఎమ్మెల్యే సక్కు ఈఈని ప్రశ్నించారు.
- కెరమెరి జెడ్పీటీసీ దుర్పతాబాయి మాట్లాడుతూ మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వాగులు, ఒర్రెల నీటిని తాగాల్సి వస్తుందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకంలో 60 మంది కార్మికులు పనిచేస్తే 80 మంది పేర్లు నమోదు చేశారని జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు తెలిపారు.
- వాంకిడి మండల కేంద్రంతోపాటు ఖమాన, బంబారలో పశువైద్యం కోసం సబ్‌సెంటర్లు ఏర్పాటు చేయాలని వాంకిడి జెడ్పీటీసీ అజయ్ కుమార్ కోరారు. శిథిలావస్థకు చేరిన రెబ్బెన పశువైద్యశాల స్థానంలో కొత్త భవనం నిర్మించాలని జెడ్పీటీసీ సంతోష్ అన్నారు.
- జిల్లాస్థాయి అధికారులు స్థానికంగా నివాసం ఉండకుండా మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారని జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు అన్నారు. అధికారులు అభివృద్ధిపై శ్రద్ధ పెట్టడం లేదని, దీనిపై కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు.
- జిల్లా కేంద్రంలో ఎంపీహెచ్‌లకు అప్రెంటిషిప్ సౌకర్యం కల్పించాలని జెడ్పీటీసీ సంతోష్ అన్నారు. తిర్యాణి మండలంలో రక్తపరీక్షల రిపోర్టుల్లో జాప్యం జరుగుతుందని, స్థానికంగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ చంద్రశేఖర్ అన్నారు. సిర్పూర్(యూ) మండలానికి చెందిన గర్భిణులకు జైనూర్‌లో స్కానింగ్ చేయాల్సి ఉండగా, ఆదిలాబాద్ తరలిస్తున్నారని జెడ్పీటీసీ కోవ అరుణ తెలిపారు. జైనూర్‌లోనే స్కానింగ్ చేయించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో తుకారాం తెలిపారు.
- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో మిషన్ల సంఖ్య పెంచాలని, స్థానికంగా ఉన్న టెక్నీషియన్లను నియమించాలని ఎంపీపీ మల్లికార్జున్ కోరారు. అలాగే కొత్తగా ఏర్పాటయ్యే వైద్యకళాశాలలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి వద్ద ఉచితంగా సేవలందించాల్సిన అంబులెన్సులు పనిచేయడం లేదని, దీంతో ప్రైవేటు అంబులెన్సుల డ్రైవర్లు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అంబులెన్సులు ఆసుపత్రి వద్ద అందుబాటులో ఉంచాలని, పరిసరాల్లో ప్రైవేటు అంబులెన్స్‌లు లేకుండా చూడాలని జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు అన్నారు. ఏడాదిలోనే జిల్లాలో ఐదుగురు డీఎంహెచ్‌వోలు మారారని, రెగ్యులర్ అధికారి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు.
- జిల్లాలో గిరివికాస్ కింద 144 యూనిట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు కేవలం 10 మాత్రమే పూర్తయ్యాయని డీఆర్‌డీఏ అధికారుల తీరుపై జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు అసహనం వ్యక్తం చేశారు. అటవీ అనుమతి సమస్యతో విద్యుత్ లైన్ వేయడం ఇబ్బందిగా మారిందని ట్రాన్స్‌కో ఎస్ఈ వాసుదేవ్ తెలిపారు. డీఆర్‌డీఏ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో గిరివికాస్ పథకం పూర్తిచేయాలని ఎమ్మెల్యే సక్కు సూచించారు. కెరమెరి మండలంలో రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని కెరమెరి ఎంపీపీ మోతీరాం అన్నారు. దహెగాం మండలంలో కేవలం ఏడుగురికి మాత్రమే రుణమాఫీ నగదు జమ అయిందని, మిగిలిన వారికి కూడా అందేలా చూడాలని జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు అన్నారు. సర్వసభ్య సమావేశంలో 40 శాఖలపై సమీక్షించాల్సి ఉండగా, కేవలం 9 శాఖలతోనే ముగించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో రత్నమాల, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో ముందుంచాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గిరిజనులు అధికంగా ఉన్న జిల్లాలో గిరివికాస్ పథకం పకడ్బందీగా అమలు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేటు అంబులెన్స్‌లను ప్రోత్సహించడం సరికాదు. – కోవ లక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్

సమస్యల పరిష్కారంపై దృష్టి

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. గిరివికాస్ పథకం సక్రమంగా అమలయ్యేలా అధికారులతో సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అంబులెన్సులు అందుబాటులో ఉంచుతాం. తిర్యాణి మండలంలో వైద్యసేవలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తాం. – హేమంత్ బోర్కడే, కలెక్టర్

క్లుప్తంగా

రేషన్ షాపులో చోరీ

కోటపల్లి: మండలంలోని కొండంపేట రేషన్ షాపులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రేషన్ డీలర్ నీల మనోహర్ బుధవారం ఉదయం సరుకులు పంపిణీ చేసేందుకు దుకాణానికి వెళ్లి చూడగా పైకప్పు తొలగించి, తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బియ్యం ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులు, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ విజయ, ఏఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. 7 క్వింటాళ్ల బియ్యం దొంగిలించారని, సుమారు రూ.25వేల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకై సామగ్రి దగ్ధం


ఇంట్లో వ్యాపించిన మంటలు

నస్పూర్: పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించడంతో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హనుమాన్‌నగర్‌కు చెందిన కంబాల శంకర్ భార్య తిరుమల బుధవారం వంటగ్యాస్ సిలిండర్‌కు రెగ్యులేటర్ మారుస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనలో ఇంటి పైకప్పు రేకులు, రిఫ్రిజిరేటర్, టీవీ, బీరువా, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిదం మహేశ్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, బొౌతు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): మండలంలోని పారిగాంలో పేకాట ఆడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం గ్రామంలో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న వారి వద్ద రూ.16,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామ సమీపంలో అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారంతో దిందా గ్రామం వద్ద తనిఖీలు నిర్వహించగా రెండు ఆటోలలో ఖర్జెల్లి నుంచి మహారాష్ట్రలోని అహేరికి తరలిస్తున్న డోకె మల్లేశ్‌కు చెందిన మూడు క్వింటాళ్లు, చౌదరి రవికి చెందిన మూడు క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు ఆయన తెలిపారు. ఆటోలను స్వాధీనం చేసుకుని చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలలో ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బంది రమేష్, మధు, సంజీవ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో గది కేటాయించాలి

మంచిర్యాలటౌన్: కలెక్టరేట్‌లో టీఎన్జీవోస్ యూనియన్‌లో ఐడీవోసీ యూనిట్ కోసం ఒక గదిని కేటాయించేలా చూడాలని కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరికి బుధవారం వినతిపత్రం అందించారు. అసోసియేషన్ సభ్యులు, జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పల్లెల్లో కాడెద్దుల పండుగ

- నేడు పొలాల అమావాస్య
- ఎడ్ల పండుగగా ప్రతీక
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామ పటేళ్లు


అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు


ఎద్దులకు పూజలు చేస్తున్న రైతు కుటుంబం (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): శ్రావణమాసంలో వచ్చే చివరి పండుగ పొలాల అమావాస్య. ఈ పండుగను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. పండుగలన్నీ మానవజాతికి చెందినవే. కానీ పొలాల అమావాస్య మాత్రం ఎద్దులకు చెందిన ప్రత్యేక పండుగ. ఈ పండుగకోసం గిరిజన గ్రామాల్లోని గూడేలు, పల్లెల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా రైతులు బుధవారం తమ ఎడ్లను శుభ్రంగా కడిగి ఇళ్లకు తీసుకొచ్చారు. కొమ్ములకు రకరకాల రంగులు, వీపుపై జూలు, మెడలో గంటలతో పాటు రంగుల బొమ్మలు వేసి అందంగా అలంకరిస్తారు. అలంకరించిన ఎద్దులతో గురువారం సాయంత్రం ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణ చేయిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామ పటేల్ తోరణం తెంపిన తర్వాత ఎద్దులను గ్రామాల్లోకి అనుమతిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేడు పొలాల అమావాస్య జరుపుకోనున్నారు.

ఎడ్లకు నైవేద్యంగా...

దేవాలయాల్లో ప్రదక్షిణ అనంతరం ఇళ్లకు తీసుకువచ్చిన ఎడ్లకు పూజలు చేసి ఆ రోజు చేసిన వంటకాల్ని నైవేద్యంగా తినిపిస్తారు. ఎడ్లు తిన్న నైవేద్యాన్ని కుటుంబ సభ్యులు ఆరగిస్తారు. ఇది


బసవన్నల వీపుపై వేసే జూలు

పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారంగా పెద్దలు చెబుతున్నారు. ఎడ్లులేని రైతులు కూడా తమతమ బంధువుల ఎడ్ల జతలను తీసుకవచ్చి పూజలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకుంటారు.

శుక్రవారం బడిగా..

పొలాల అమావాస్య మరుసటిరోజు బడిగా పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. శ్రావణమాసంలో నెల రోజులపాటు మాంసాహారం భుజించకుండా నియమనిష్టలతో పాటిస్తారు. అనంతరం బడిగా పండుగరోజు మాంసాహారం స్వీకరిస్తారు. 'ఈగలు, దోమలు, రోగాలు, తీసుకుపోరా బడిగా' అంటూ ఇళ్ల నుంచి కేకలు వేస్తూ రాత్రి చేసిన పిండివంటల నైవేద్యాన్ని తీసుకుని గ్రామ పొలిమేర వరకు వెళ్తారు. అక్కడ జమ్మిచెట్టుకు పూజలు జరిపి కలిసికట్టుగా నైవేద్యం ఆరగిస్తారు. ఆ రోజు నుంచి ఈగలు, దోమలు, వ్యాధులు పారిపోతాయని గ్రామీణ ప్రాంత ప్రజల నమ్మకం.

ఉత్సాహంగా జరుపుకుంటాం



ఏడాదికోసారి వచ్చే పొలాల పండగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటాం. ఎడ్ల పండుగకు ప్రతీతి పొలాల అమావాస్య. ఎడ్లకు చెందిన పండుగగా భావించి రైతులందరు తమ ఎడ్లను అందంగా అలంకరిస్తారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ ఎద్దులతో ఐదు ప్రదక్షణలు చేయిస్తాం. ఇది పురాతన కాలం నుంచీ వస్తున్న ఆచారం.

– మడావి రఘునాథ్, ఆదివాసీ నాయకుడు, మెట్టపిప్రి

క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయి

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

నస్పూర్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా 2023–24 వార్షిక క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ యాజమాన్యం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. ఏరియా క్రీడాకారులు కోల్ ఇండియా లెవెల్ పోటీలలో పాల్గొని బహుమతులు సాధించాలన్నారు. నేడు జరిగిన వాలీబాల్ పోటీలలో ప్రథమస్థానంలో ఎస్ఆర్‌పీ గ్రూప్ జట్టు, ద్వితీయస్థానంలో ఆర్‌కే 7 గ్రూప్ జట్టు నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్ రెడ్డి, ఎస్వోటూ జీఎం కె.రఘుకుమార్, డీజీఎం (పర్సనల్) పి.అరవిందరావు, స్పోర్ట్స్ హానరరీ సెక్రెటరీ పాలకుర్తి రాజు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో టీబీజీకేఎస్ విఫలం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి


ఆర్‌కే న్యూటెక్ గనిపై మాట్లాడుతున్న రాజారెడ్డి

నస్పూర్: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే న్యూటెక్ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలను రాబట్టలేక ఆర్థికంగా నష్టపోయి చివరికి జీతాలు చెల్లించడానికి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తే టీబీజీకేఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, మారుపేర్లు సవరించాలని, 2011లో అలవెన్స్‌లపై ఐటీమాఫీ ఒప్పందాన్ని అగ్రిమెంట్ ప్రకారం సంస్థలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం కార్మికుల పక్షాన పోరాడుతున్న సీఐటీయూని రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గాదరి భాగ్యరాజ్, ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెంగళ శ్రీనివాస్, నాయకులు బానేష్, అజయ్, అశోక్, సదానందం, రాజయ్య, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి


మాట్లాడుతున్న ముస్కె సమ్మయ్య

నస్పూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీసీసీ లోని సీఎస్‌పీపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోల్ ఇండియాలో అమలవుతున్న హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, జీవో 22ను గెజిట్ చేసి వేతనాలు పెంచాలని, కార్మికులు గత సెప్టెంబర్ 9 నుంచి 26 వరకు నిర్వహించిన సమ్మెలో భాగంగా ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచ్ అధ్యక్షుడు రవీందర్, బ్రాంచి ఉపాధ్యక్షుడు కాతరాజు ప్రభాకర్, ఆర్‌కే 5 పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ముందే ఎన్నో సిత్రాలు!


బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేస్తున్న రవి (ఫైల్)


మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న రవి


దండేపల్లి: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే వివిధ పార్టీల్లో చిత్ర, విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పార్టీనుంచి ఆపార్టీలోకి, ఆ పార్టీలోంచి ఈపార్టీకి, ఇలా వివిధ పార్టీల్లో చేరికల ప్రక్రియ సాగుతోంది. దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శాతరాజు రవి ఈనెల 8న బెల్లంపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఐదు రోజుల వ్యవధిలో బుధవారం ఎమ్మెల్యే దివాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాడు. ఎన్నికల సమయంలో ఇంకెన్ని చిత్రాలు చోటు చేసుకుంటాయోనని పలువురు చర్చించుకుంటున్నారు.

పరిహారం చెల్లించాలని మంత్రికి వినతి


వినతిపత్రం ఇస్తున్న అశోక్‌యాదవ్

భీమారం(చెన్నూర్): రాష్ట్ర వ్యాప్తంగా పిడుగుపాటుతో మృతి చెందిన గొర్రెలకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌యాదవ్ బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది పిడుగుపాటుతో అధికసంఖ్యలో గొర్రెలె మృత్యువాత పడ్డాయని, పశువుల కాపరులు కూడా మృతి చెందారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలని కోరారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

బీసీ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'నరెడ్ల'


నరెడ్ల శ్రీనివాస్

పాతమంచిర్యాల: తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరెడ్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని జాగృతి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శ్రీనివాస్ నియామకం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


ఆర్థికసాయం అందిస్తున్న ఎస్పీ

జైనూర్: గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని కాశీపటేల్ గూడకు చెందిన కుడ్మేత జలపత్ (55) ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బుధవారం ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేల నగదు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఐలు రమేశ్, రాణా ప్రతాప్, మల్లేశ్, సురేష్, ఎస్సై సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

వార్షిక లక్ష్య సాధనకు కృషి చేయాలి


కైరిగూడ ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్య సాధనకు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం కైరిగూడ ఓసీపీని సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకత, సివిల్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. వేస్ట్ వ్యూ పాయింట్ నుంచి కై రిగూడ ఓసీపీ పనిస్థలాలను పరిశీలించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్య సాధనకు అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలన్నారు. వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా తగు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కై రిగూడ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'లారీ యజమానులను ఆదుకోవాలి'


మాట్లాడుతున్న లారీ ఓనర్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి బొగ్గు రవాణాకు ఆర్డర్స్ ఇచ్చి ఆదుకోవాలని లారీ యజమానులు డిమాండ్ చేశారు. బుధవారం గోలేటిలోని జీఎం కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించిన అనంతరం తమ సమస్యలను ఏరియా ఎస్వోటూ జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల రవీందర్ మాట్లాడుతూ సుమారు 1500ల మంది 20 ఏళ్లుగా బొగ్గు లోడింగ్‌పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సింగరేణి సీహెచ్‌పీ, రైల్వే వ్యాగన్ల ద్వారా బొగ్గు రవాణా చేస్తుండడంతో లారీలకు ఆర్డర్లు తగ్గి లారీ ఓనర్లతో పాటు డ్రైవర్లు, క్లీనర్ల జీవితాలు అతలాకుతలమయ్యాయన్నారు. లారీలకు ఈఎంఐలు కూడా కట్టలేని పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం లారీలకు ఆర్డర్లు ఇచ్చి లారీ ఓనర్లను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్లు ఇందూరి సురేష్, అంగల రమేశ్, నాగేందర్, జబ్బర్, శంకర్, అమీర్, గడ్డం గణేశ్, మనోజ్ జైస్వాల్, దాసరి యుగేందర్, మోడెం మనోజ్ కుమార్ గౌడ్, దాసరి రాజేందర్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో నలుగురు ఎస్సైల బదిలీ


బదిలీ అయిన ఎస్ఐ అశోక్


బాధ్యతలు స్వీకరిస్తున్న జి.రాజశేఖర్

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్ల వ్యవధిలోనే ఏకంగా నలుగురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. ఎవరూ పూర్తి స్థాయిలో ఇక్కడ పనిచేయకపోవడం అనేక ఊహాగానాలకు తావిస్తోంది. తాజాగా ఎస్సై అశోక్ బదిలీ అయ్యారు. రెండేళ్ల కాలంలో ఏకంగా నలుగురు ఎస్సైలు మారిన పోలీస్‌స్టేషన్ రామకృష్ణాపూర్ కావడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ఏ పోలీస్‌స్టేషన్‌లో లేని విధంగా ఇక్కడే ఈ పరిస్థితి నెలకొనడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోనే పేరున్న పోలీస్‌స్టేషన్లలో ఒక్కటైన ఆర్‌కేపీ స్టేషన్‌లో ఇటీవల విధులు నిర్వర్తిస్తున్న అధికారుల్లో చాలామంది ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండడంలో వైఫల్యం చెందుతున్నారని తెలుస్తోంది. ఇదే అభిప్రాయంతో ఉన్న ఉన్నతాధికారులు ఆ లోపాన్ని అధిగమించేందుకు బదిలీ వేటు వేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై అశోక్‌ను బెల్లంపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని మాదారానికి, అక్కడ పనిచేస్తున్న ఎస్సై జి.రాజశేఖర్‌ను ఆర్‌కేపీకి బదిలీ చేశారు. జి.రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న దుర్గం భాస్కర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట సమీపంలో గుడిసెలు కాలబెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సంపత్, రాజేశ్, కృష్ణమూర్తి, భాస్కర్, విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్, అనపర్తి యువరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యుడు బొడెంకి చందు ఉన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు పోటీలు

మంచిర్యాలఅర్బన్: భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా వీరగాథ–3 పేరిట పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా ప్రజెంటేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఈనెల 30 వరకు ఎంట్రీలను అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు పాల్గొనాలని, వివరాలకు 9849550200 లో సంప్రదించాలని సూచించారు.

ఉద్యానపంటల వైపు దృష్టి సారించాలి

భీమారం(చెన్నూర్): రైతులు ఉద్యానవన తోటల పెంపకంపై దృష్టి సారించాలని జిల్లా అదనపు డీఆర్‌డీవో దత్తారావు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రాగన్ ఫ్రూట్, మామిడి, బత్తాయి, బొప్పాయి తోటలను పెంచేందుకు ముందుకు రావాలన్నారు.

టీచర్లపై చర్యలు తప్పవు

మంచిర్యాలఅర్బన్: స్పౌజ్ ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకుని స్పౌజ్ పాయింట్ వాడుకుంటున్న సందర్భంగా వెబ్ ఆప్షన్ పెట్టేటప్పుడు సంబంధిత పాఠశాల, స్పౌజ్ పనిచేసే మండలం, పక్క మండలం ఆర్డర్ పెట్టాలని డీఈవో యాదయ్య తెలిపారు. అలా కాకుండా వేరే మండలం వెబ్ ఆప్షన్ పెట్టినట్లయితే సీసీఏ రూల్స్ ప్రకారం శిక్షార్హులు అవుతారన్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి బుధవారం అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. రెండు ఏఎన్ఎం పోస్టులకు 117, నైట్ వాచ్‌మెన్ పోస్టుకు 58 మంది దరఖాస్తు చేసుకున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

టీఎంఎంఎస్ న్యాయ సలహాదారుడిగా రాజు

బెల్లంపల్లిరూరల్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ (టీఎంఎంఎస్) మంచిర్యాల జిల్లా న్యాయ సలహాదారుడిగా దాసారపు రాజు నియామకమయ్యారు. ఈ మేరకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్, టీఎంఎంఎస్ గౌరవ అధ్యక్షుడు బండ ప్రకాష్ ముదిరాజ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.


అక్రమ నిర్మాణం కూల్చివేత


కూల్చి వేయిస్తున్న అధికారులు

నస్పూర్: ఈ నెల 12న 'సెలవు రోజు–అక్రమ నిర్మాణాల జోరు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నస్పూర్ శివారులోని సర్వే నంబర్ 42లో ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయానికి కేటాయించిన స్థలంలో అక్రమంగా వెలిసిన షెడ్డును బుధవారం జేసీబీ సాయంతో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ టీం (మున్సిపల్, రెవెన్యూ, పోలీస్) ఆధ్వర్యంలో కూల్చి వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చందర్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక్‌కు ఎమ్మెల్యే ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..



ఫోన్‌పే ద్వారా పంపించిన ఆర్థికసాయం

కెరమెరి(ఆసిఫాబాద్): సిక్కిం రాష్ట్రంలోని నామ్‌చా జిల్లాలో ఈ నెల 18 నుంచి కొనసాగనున్న శిక్షణలో పాల్గొందుకు వెళ్తున్న కెరమెరి మండలంలోని కెలి కే గ్రామానికి గిత్తే కార్తీక్‌కు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బుధవారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఈ నెల 12న 'ఎవరెస్ట్ వైపు తొలి అడుగు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. ఫోన్‌పే ద్వారా కార్తీక్ ఖాతాలో రూ.10 వేలు జమచేశారు. కార్తీక్‌తో పాటు అతని తల్లిదండ్రులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.